క్లుప్తంగా

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ ట్రంకు రోడ్‌లో గల శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి దేవస్థానం(స్వయంభు)లో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 2 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి చుండూరి రామకోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఆకాశదీపంతో మహోత్సవాలు ప్రారంభమై నెల రోజుల పాటు నిత్యం ప్రత్యేక పూజాకార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

'తెలంగాణలో వచ్చేది బీజేపీనే..'

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమని ఆ పార్టీ అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని 37వ డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా.. నాయకులు పసుమర్తి సంతోష్, గుర్రాల నాగేందర్, పొట్టిముత్తి జనార్దన్, ధర్మేందర్, దారా శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బదిలీ

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.ప్రవీణ్ బదిలీ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలో భాగంగా కామేపల్లిలో పనిచేస్తున్న ప్రవీణ్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. అయితే కార్యదర్శి తల్లి అనారోగ్య సమస్య కారణంగా రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కామేపల్లి మండలంలోని గోవింద్రాల పంచాయతీకి బదిలీ చేశారు. ప్రస్తుతం కోనాయిగూడెం పంచాయతీకి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా కోరట్లగూడెం కార్యదర్శి రవిని నియమించారు.

సన్మార్గంలో నడిపించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని పలువురు వక్తలు తెలిపారు. మంగళవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన 'నైతికలే నిజమైన స్వేచ్ఛ'అనే అంశంపై జరిగిన సభలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇషరత్ బాను మాట్లాడారు. రాబోయే తరాల భవిష్యత్ అంధకారం కాకుండా ఉండాలంటే దివ్యఖురాన్ బోధనలన్నారు. ఆ తర్వాత రాష్ట్ర డైరెక్టర్ అతహర్ మాట్లాడాక వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.హుస్సైన్‌బీ, అస్మా అంజుమ్, ఖాసిమా షాహిన్, సమీనా, నసరత్, హాజీర, సదఫ్, నస్రీన్, తబుస్సు, ఫర్హానా, నసీమా, జహీరా, నూర్జహాన్, ఆరీఫా తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణకు మార్కింగ్



మార్కింగ్ చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 25వ డివిజన్‌లో అంబా భవాని గుడి రోడ్డు విస్తరణ చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం.. వాహనదారుల ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ రోడ్డు 40 అడుగుల వెడల్పుతో ఉండాల్సి ఉండగా.. ఆ మేర లేకపోవడంతో అధికారులు మంగళవారం కొలతలు వేసి మార్కింగ్ చేశారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

సుహాస్ జ్యుయెలరీస్‌లో లక్కీ డ్రా



డ్రా తీస్తున్న యాజమాన్య బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: సుహాస్ జ్యుయెలరీస్‌లో ఆభరణాలు కొనుగోలు చేసిన వారి నుంచి విజేతల ఎంపికకు మంగళవారం డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి 50 గ్రాముల బంగారాన్ని బి.అవినాష్‌తో పాటు 20 గ్రాముల బంగారం ఎస్.మౌనిక, 10 గ్రాముల బంగారం దివ్యశ్రీ, 100 గ్రాముల వెండి సంధ్య, 50 గ్రాముల వెండిని సంతోష్‌రెడ్డి గెలుచుకున్నారని యాజమాన్యం ప్రకటించింది.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	వేనమ్
సాయిరాం	విశ్వం
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	లగ్గం, వేట్టయన్‌ద హంటర్

- ఖమ్మంగాంధీచౌక్

నాలుగేళ్లుగా నిరాదరణ..



సమావేశ మందిరంలో ఊడిపోయిన సీలింగ్, పాడైన ఏసీలు



రంగులు వెలసిపోయిన వరండా

శిథిలావస్థలో టీటీడీసీ
- నాడు కళకళ.. నేడు వెలవెల
- సమావేశాలు లేక ఖాళీగా భవనం
- ఆదాయం లేక సిబ్బంది వేతనాలు కటకట

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న సమయంలో.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక సంవత్సరాలు ఖమ్మంలోని టీటీడీసీ భవనంకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉండేది. నగరంలో అన్ని వసతులతో ప్రభుత్వ అధికారిక సమావేశాలు, మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు 2002 మే 26న నాటి ప్రభుత్వం టీటీడీసీ (ట్రెనింగ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్) పేరుతో భవనాన్ని నిర్మించి ప్రారంభించింది. నాటి నుంచి జిల్లా స్థాయి అధికారిక సమావేశాలు ఏమున్నా ఈ భవనంలోనే ఏర్పాటు చేసేవారు. ముఖ్యమంత్రులు జిల్లా కేంద్రానికి వచ్చిన సమయంలోనూ ఈ భవనంలోనే అధికారులతో జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అయితే గత నాలుగేళ్లుగా ఈ భవనం నిరాదరణకు గురవుతోంది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో టీటీడీసీ శిథిలావస్థకు చేరుతుంది. ఇక అక్కడ పని చేసే సిబ్బంది ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలుస్తోంది.

నిర్వహణ భారం..

టీటీడీసీలో నిర్వహించే సమావేశాలు, ఇతర కార్యక్రమాల ద్వారా ఆదాయం సమకూరేది. ఆ ఆదాయంతో అక్కడ పని చేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వడంతో పాటు భవన నిర్వహణను చూసుకునే వారు. కానీ కొంత కాలంగా ఇక్కడ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో కనీస ఆదాయం రావడం లేదు. ఇటీవల కాలంలో భవనం మరమ్మతులకు గురికావడంతో నిధులు లేక అధికారులు వదిలేసినట్లు తెలుస్తోంది. ఇక సిబ్బందికి చాలీచాలని వేతనాలను అందిస్తున్నట్లు సమాచారం. వెనుక వైపు ఉన్న గేటు శిథిలావస్థకు చేరింది. అంతా అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఈ భవనంపై దృష్టి సారించి, మరమ్మతులు చేయిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ సమావేశాలు నిర్వహించుకునేందుకు అద్దెకు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది.

నిధులు లేవు..

టీటీడీసీ భవనం మరమ్మతులు చేసేందుకు నిధులు లేవు. సిబ్బందికి వేతనాలను సక్రమంగానే ఇస్తున్నాం. భవనం మరమ్మతులు చేయించేందుకు సమయం పడుతుంది.

– ఆర్.సన్యాసయ్య, డీఆర్‌డీఓ

అన్నీ ఇక్కడే..



శిథిలావస్థకు చేరుతున్న టీటీడీసీ భవనం

2002 సంవత్సరం టీటీడీసీ భవనం ప్రారంభించక ముందు అధికారులు, మంత్రులు ఖమ్మంలో జిల్లా స్థాయి అధికారిక సమావేశాలు నిర్వహించాలంటే అనేక ఇబ్బందులు పడేవారు. టీటీడీసీ భవనం ప్రారంభం అయిన తర్వాత మంత్రులు, కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలు, రాష్ట్ర ముఖ్య కార్యదర్శులు ఏ చిన్న సమావేశం పెట్టాలన్నా టీటీడీసీలోనే ఏర్పాటు చేసేవారు. ఇక మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమాలు, బ్యాంకర్ల సమావేశాలు, సాంకేతిక పరమైన సమావేశాలు అన్నీ ఇక్కడే నిర్వహించేవారు. డీఆర్‌డీఏ నిర్వహణలో ఉన్న ఈ భవనంలో ఇతర శాఖల అధికారులు తమ సమావేశాలను ఇక్కడే నిర్వహించేవారు. దీంతో నిత్యం భవనం కళకళలాడేది. అయితే గత మూడు నాలుగేళ్ల నుంచి టీటీడీసీలో సమావేశాల నిర్వహణ పూర్తిగా తగ్గిపోయింది. ఇటీవల కాలంలో చిన్న చిన్న సమావేశాలు కూడా నిర్వహించడం లేదు. డీఆర్‌డీఏ సమావేశాలను సైతం డీపీఆర్‌సీ వంటి బిల్డింగ్‌ల్లో నిర్వహిస్తున్నారు. ఇతర శాఖల అధికారులు కొత్త కలెక్టరేట్‌లో సమావేశ మందిరాల్లో, భక్తరామదాసు కళాక్షేత్రంలో, డీపీఆర్‌సీ భవనాల్లో తమ సమావేశాలను నిర్వహిస్తున్నారు. దీంతో టీటీడీసీలో సమావేశాలు ఏర్పాటు చేసేవారు లేకుండా పోయారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యాన నిర్వహించే దిశ కమిటీ సమావేశం సైతం ఐడీఓసీలోనే నిర్వహించారు.

పలువురికి మంత్రి పొంగులేటి పరామర్శ



జల్లెపల్లిలో పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ రేఖ ముత్తయ్య, పడమటతండాకు చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ హుస్సేన్, పాతర్లపాడులో జడల శ్రీను కుటుంబాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, నరేందర్‌రెడ్డి, కిరణ్, మంగీలాల్, జడల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి..

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకులు మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ నెల రోజుల్లో పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాల కిట్ అందిస్తున్న ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పోలీసు అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వర్తక సంఘం భవనంలో మున్నేరు వరద బాధితులకు మంగళవారం టాటా క్యాపిటల్ సంస్థ ఆధ్వర్యాన నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. మొత్తం 3 వేల మంది బాధితులకు పంపిణీ లక్ష్యం కాగా, మంగళవారం 1,200 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయ్‌బాబు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, త్రీటౌన్ సీఐ రమేష్, టాటా క్యాపిటల్ సంస్థ ప్రతినిధులు బానూ ప్రకాష్, అమరేష్ సాహు, అశోక్‌కుమార్, రవికుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'కు బానిస కావొద్దు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్‌ఏబీ డీఎస్పీ కె.మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు ఆగమవుతాయన్నారు. అంతేకాక దేశ భద్రతకు, ప్రభుత్వానికి, వ్యక్తిగతంగా నష్టం జరుగుతుందన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, సేవిస్తున్నా టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా 87126 71111కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ బి.రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం పాఠశాలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన 'చిన్నారి'కార్యక్రమంలో భాగంగా చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. ఈమేరకు బాల్య వివాహాలు, మంచి, చెడు స్పర్శలు, మాదకద్రవ్యాలు వాడకం, నివారణ, ఇంటర్నెట్ దుర్వినియోగం, పిల్లల అక్రమరవాణా, లైంగిక వేధింపులు తదితర అంశాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పోరికా, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి శ్రీలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్'లో వర్క్‌షాపు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సీఆర్ఐఎస్‌పీ, ఐక్యూఏసీ ఆధ్వర్యాన ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ (ఐడీపీ)పై మంగళవారం ఒక రోజు వర్క్‌షాపును నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. అఖిల్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని అధ్యాపక బృందానికి ఐడీపీపై శిక్షణనిచ్చారన్నారు. అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల వెంట ఆక్రమణల తొలగింపు



43వ డివిజన్‌లో డబ్బా కొట్టును తరలిస్తున్న దృశ్యం



కాంప్లెక్స్ గోడలను పడగొడుతున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రోడ్ల వెంట ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈమేరకు మంగళవారం నగరంలోని 43వ డివిజన్‌లో నేమ్ బోర్డులు, ఇతర డబ్బాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది డీఆర్ఎఫ్ సిబ్బంది చేత తొలగించారు. ఆక్రమణలు చేస్తే సహించేది లేదని అధికారులు తెలిపారు. అలాగే 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లో రోడ్ల వెంట అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను అడ్డుకొని, గోడలను తొలగించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన గోపాల్‌రెడ్డి

కామేపల్లి: తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడిగా తనకు రాష్ట్ర స్థాయిలో సముచిత స్థానం కల్పించినందుకు గానూ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మంగళవారం మధిరలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకులు మద్దినేని రమేష్‌బాబు, కొండాయిగూడెం, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, దొడ్డ వేణు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 43వ, 44వ, 50వ, 51వ డివిజన్లలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, పార్కుల మెయింటెనెన్స్‌ను మంగళవారం కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా పర్యవేక్షించారు. 51వ డివిజన్‌లో వ్యర్థాల తొలగింపు సక్రమంగా లేదని, వెంటనే తొలగించాలని జవాన్‌ను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

రోటరీనగర్ పార్కులో స్వచ్ఛ దీపావళి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 9వ డివిజన్ రోటరీనగర్ పార్కులో మంగళవారం స్వచ్ఛ దీపావళి-శుభ దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులో చెత్తను తొలిగించి గ్రీన్ పార్కుగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్, స్థానికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి విగ్రహం ఏర్పాటు నిర్ణయంపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: అంతర్జాతీయస్థాయిలో మహాత్మాగాంధీ ఎత్తైన విగ్రహం హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ నిర్ణయించడం హర్షణీయమని గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ జిల్లా అధ్యక్షుడు ముత్తాడి దామోదర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం నగరంలోని జిల్లా పౌర సంఘం కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రస్థాన్ ఆధ్వర్యాన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శ్రీలక్ష్మి, బాధ్యులు విజయ్, భీంరెడ్డి, రామనాథం, హరిబాబు, శేఖర్, వెంకన్న, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: కార్తీకమాస మహోత్సవాలపై రూపొందించిన కరపత్రాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి ఆవిష్కరించారు. నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.ఆనంద్, ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ నర్సింహారావు, అర్చకులు కృష్ణమాచార్యులు, కేవీఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

వినతులు, నిరసనలు

రైతుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రూ.2 లక్షల వరకు రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య అన్నారు. ఈమేరకు మంగళవారం రూరల్ తహసీల్దార్ బి.రాంప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అచ్చయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయాన రైతాంగానికి ఇచ్చిన హామీల్లో భాగంగా రైతు భరోసా అమలు చేసి ఆదుకోవాలని, సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీర్ల వెంకటప్పారావు, మలీదు నాగేశ్వరరావు, పుచ్చకాయల శ్రీనివాసరావు, కొత్త రమేష్, మహంకాళి బాబు, గుడిచుట్టు మాధవరావు,మారుతి మల్లయ్య, దొండేటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

నేలకొండపల్లి: ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చింది.. దారి లేక పంట కోత నిలిచిపోయింది.. మాకు దారి చూపించండి సారూ అంటూ గిరిజన బాధిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన 33 మంది గిరిజన రైతులకు గ్రామంలో దాదాపు 50 ఎకరాలు భూమి ఉంది. వీరి పొలాలకు వెళ్లేందుకు గత కొంత కాలంగా దారి పంచాయతీ జరుగుతుండగా.. ఓ రైతు కంచె వేడయంతో దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యతో గత రెండేళ్ల నుంచి పంట సాగు చేయకుండా బీడు భూములుగా వదిలేశారు. కాగా ఈ ఏడాది వరి సాగు చేసి పంట కోసినా తీసుకొచ్చేందుకు దారి లేక అక్కడే వదిలేశారు. దీంతో రైతులు వరి కంకులతో నినాదాలు చేస్తూ తహసీల్ వద్ద ఆందోళన నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ జె.మానిక్‌రావు అందించారు. దీనికి తహసీల్దార్ స్పందించి వెంటనే సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను విచారణకు ఆదేశించి నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన బాధిత రైతులు బి.వెంకటేశ్వర్లు, బానోత్ రంజిత్, భూక్యా రవి, మాళోత్ బాలు, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలోని దానవాయిగూడెం నీటి శుద్ధి, సరఫరా కేంద్రంలో పని చేస్తున్న పంపు ఆపరేటర్లను ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు అన్నారు. ఈమేరకు మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేటర్లకు తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదని, వారికి గుర్తింపు లేకుండా పోతోందన్నారు. 19 మంది పంపు ఆపరేటర్లను ఔట్‌సోర్సింగ్ విధానంలో తీసుకుంటామని గతంలో హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జి.మహేష్‌బాబు, సీహెచ్ అంజయ్య, పి.నాగరాజు, నవీన్, ఎల్.అజయ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు, సర్వీసుల సంఖ్య పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 13మంది ఫోన్ చేసి సమస్యలు చెప్పడమే కాక సూచనలు ఇవ్వగా పరిశీలిస్తామని డీఎం తెలిపారు. కాగా, ఇల్లెందు రూట్‌లో శాంతినగర్, రఘునాథపాలెం మండల ఆఫీస్, బూడిదంపాడు వద్ద ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ ఏర్పాటు చేయాలని, ఖమ్మం-గుంటూరు, ఖమ్మం-తల్లాడ-కల్లూరు-విజయవాడ, ఖమ్మం-దానవాయిగూడెం-కామంచికల్, ఖమ్మం-పాతర్లపాడు-చింతకాని ప్రాంతాలకు బస్సులు నడపాలనే వినతులు వచ్చాయి. అలాగే, ఉదయం సమయాన తొర్రూరుకు బస్సుల సంఖ్య పెంచాలని పలువురు కోరారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి సేవ చేయాలని ఖజానా శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్. నరసింహం అన్నారు. మంగళవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య అందించిన రూ.20వేల చెక్కును నిరుపేద విద్యార్థి మాతంగి శ్రీపతికి అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య మాట్లాడుతూ.. తన మనుమరాలు కుంచకూరి పోష్యసాయి జన్మదినం సందర్భంగా జనగామ ప్రభుత్వ వైద్యవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థి శ్రీపతి చదువుకు తన వంతుగా సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఓ సాగర్, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం బాధ్యులు కృష్ణమూర్తి, కె. వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఖమ్మంఅర్బన్: దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కళాఉత్సవ్-2024 కార్యక్రమంలో భాగంగా గిరిజన-జానపద నృత్యం కేటగిరీలో నగరంలోని 1వ డివిజన్ ఖైకొండాయిగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినుల బృందం ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఈ శ్రీదేవి తెలిపారు. విద్యార్థినులు ఉష, విజయలక్ష్మి, సంజన, భాగ్యలక్ష్మి, హంసలినిక తదితర బృందం జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి నవంబరు 1న హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈమేరకు మంగళవారం పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్, సభ్యులు విద్యార్థినులను అభినందించారు.

తెల్దారుపల్లి విద్యార్థిని..



చరితశ్రీ

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన మాదర బోయిన చరితశ్రీ పాఠశాల క్రీడల ఫెడరేషన్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి షటిల్ పోటీకు అర్హత సాధించినట్లు కోచ్ యండపల్లి హరీశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం చరితశ్రీని వరంగల్ క్రాస్‌రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో హెచ్‌ఎం, సిస్టర్ లీనా, గ్రామపెద్దలు సిద్ధినేని కోటయ్య, మడిపల్లి వెంకన్న, అవినాష్ తదితరులు అభినందించారు.

'నయాబజార్' విద్యార్థి..



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంస్పోర్ట్స్': రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ కళాశాల విద్యార్థి బి.గౌతమ్ ఎంపికైనట్లు నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.రామారావు తెలిపారు. మంగళవారం విద్యార్థిని అభినందించి మాట్లాడారు. ఇటీవల నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని, వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'విన్‌ఫీల్డ్' విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన యోగా పోటీల్లో తమ విద్యార్థి జి.హేమంత్‌సాయి రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించినట్లు విన్‌ఫీల్డ్ డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్‌లు తెలిపారు. మంగళవారం విద్యార్థిని పాఠశాలలో అభినందించాక వారు మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడా, యోగా తదితర పోటీలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.